క్లుప్తంగా

రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ నిర్వహిస్తున్న దృశ్యం

మడకశిరరూరల్: మండల పరిధిలోని హరేసముద్రం పంచాయతీలోని దొమ్మహట్టిలో రూ.4 లక్షలు మండల ప్రజా పరిషత్ నిధులతో సోమవారం సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. వైస్ ఎంపీపీ నరసింహామూర్తి, సర్పంచ్ కరియన్న భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 35 ఏళ్ల నుంచి గ్రామంలో సీసీ రోడ్డు సౌకర్యాం లేక అధ్వాన్నంగా ఉండటంతో ప్రజలు ఇబ్బందులు పడుతుండేవారన్నారు. గ్రామ ప్రజలు ఇబ్బందులను గుర్తించి సీసీ రోడ్డు నిర్మాణాం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సేగౌడు, ఈశ్వర్, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

గోరంట్ల: మండలంలోని రెడ్డిచెరువుపల్లి పంచాయతీ పరిధిలోని తమ్మినాయినపల్లి, కాలేకుంటపల్లి, గుత్తివారిపల్లి గ్రామాల్లో మంగళవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ రఘునాథ గుప్తా తెలిపారు. ఎమ్మెల్యే మాలగుండ్ల శంకర నారాయణ ఆధ్వర్యంలో తమ్మినాయినపల్లి గ్రామంలో ఉదయం 9 గంటలకు కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న పోలీసులు

రొద్దం: మండల పరిధిలోని రాచూరు గ్రామ సమీపంలో హుసేన్‌పురం గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి కర్ణాటక మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం వచ్చిందని ఎస్‌ఐ నాగస్వామి తెలిపారు. దాడులు చేపట్టగా 100 కర్ణాటక మద్యం ప్యాకెట్లతో పట్టుబడినట్లు పేర్కొన్నారు. మద్యం తరలిస్తున్న ద్విచక్ర వాహనం, మద్యం స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేశామన్నారు.

31న మండల సర్వసభ్య సమావేశం

పరిగి:మండల సర్వసభ్య సమావేశాన్ని ఈనెల 31న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరస్వతి తెలిపారు. గురువారం ఉదయం స్థానిక ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో ఎంపీపీ సవిత అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండల ప్రాదేశిక సభ్యులు, జిల్లా ప్రాదేశిక సభ్యులతో పాటూ ఆయా గ్రామ పంచాయతీ సర్పంచ్‌లు తప్పక హాజరుకావాలన్నారు. అలాగే మండల స్థాయి అధికారులంతా అభివృద్ధి నివేదికలతో రావాలని సూచించారు.


క్లూస్ టీం పరిశీలన



చోరీ జరిగిన ఇంటిని పరిశీలిస్తున్న క్లూస్ టీం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని షిర్డినగర్‌లో మారుతీ అనే వ్యక్తికి చెందిన ఇంట్లో ఆదివారం చోరీ జరిగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పుట్టపర్తి నుంచి క్లూస్ టీం ఎస్‌ఐ రఫీక్ ఆధ్వర్యంలో సిబ్బంది చోరీ జరిగిన ఇంటిని పరిశీలించింది. అదే ఇంటిలో ద్విచక్ర వాహనం కూడా దుండగులు ఎత్తుకెళ్లారు. అయితే చోరీకి గురైన ద్విచక్ర వాహనాన్ని మండలంలోని పందిపర్తి రైల్వేగేట్ సమీపంలో దుండగులు వదిలి వెళ్లిన విషయం తెలుసుకున్న ఎస్‌ఐ విజయ్‌కుమార్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని క్లూస్ టీంను రప్పించి ద్విచక్ర వాహనాన్ని పరిశీలించారు. లభ్యమైన ఆధారాల మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

లేపాక్షి: మండల పరిధిలోని కుర్లపల్లికి చెందిన చాకలి ప్రవీణ్‌కుమార్ రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. లేపాక్షి మండల పరిషత్ ఉపాధ్యక్షులు అంజినరెడ్డి రూ.15 వేలు, పాఠశాల కమిటీ చైర్మన్ సయ్యద్ నిస్సార్ అహమ్మద్ రూ.5 వేలు బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శ్రీనివాసులు, జగన్నాథ్‌రెడ్డి, అన్సార్, నంజిరెడ్డి, భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డి, వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు రుణపడి ఉంటా

- జిల్లాలో టీటీడీ తరుఫున ఆలయాల అభివృద్ధికి కృషి చేస్తా
- ఎమ్మెల్యే తిప్పేస్వామి



ఎమ్మెల్యే తిప్పేస్వామి దంపతులను సన్మానిస్తున్న దృశ్యం

మడకశిర: శ్రీవారికి సేవ చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానని టీటీడీ బోర్డు సభ్యుడు, ఎమ్మెల్యే తిప్పేస్వామి తెలిపారు. సోమవారం మున్సిపల్ కార్యాలయం ఆవరణలో ఎమ్మెల్యేకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులకు నియోజకవర్గంలోని ప్రజా ప్రతినిధులు, నాయకులు, అధికారులు, అన్ని వర్గాల ప్రజలు జ్ఞాపికను అందజేసి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దంపతులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే తిప్పేస్వామి మాట్లాడుతూ తనకు టీటీడీ బోర్డు సభ్యుడి పదవి వస్తుందని ఊహించలేదన్నారు. అయితే ముఖ్యమంత్రి తనపై ఎంతో నమ్మకం ఉంచి టీటీడీ బోర్డు సభ్యుడిగా నియమించారని తెలిపారు. ముఖ్యమంత్రి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పని చేస్తానన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు తెస్తానని తెలిపారు. తనకు ఈ పదవి ఇచ్చిన ముఖ్యమంత్రి జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటానని తెలిపారు. టీటీడీ తరుపున జిల్లా వ్యాప్తంగా దేవాలయాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. నియోజకవర్గంలోని దేవాలయాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తానని చెప్పారు. భక్తులకు అందుబాటులో ఉండి వారు ఇబ్బందులు పడకుండా సేవలు అందిస్తానని తెలిపారు. మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ మడకశిర ప్రాంతానికి తొలిసారిగా టీటీడీ బోర్డు సభ్యత్వం దక్కడం ఆనందంగా ఉందన్నార. దళిత ఎమ్మెల్యే తిప్పేస్వామికి ఈ పదవి ఇవ్వడం ఎంతో గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ లక్ష్మీనరసమ్మ, వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, వైస్ చైర్‌పర్సన్ వెంటకలక్ష్మమ్మ, కార్పొరేషన్ డైరెక్టర్లు రామకృష్ణ, నాగరాజగౌడ్, వేణు, సింగల్ విండో అధ్యక్షులు రామిరెడ్డి, చంద్రశేఖర్, ఎంపీపీ కవిత, జెడ్పీటీసీ సభ్యురాలు సరోజమ్మ, ఏడీసీసీ బ్యాంకు డైరెక్టర్ కారుణ్య, కోఆప్షన్ సభ్యులు కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు



నాయనిపల్లిలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త దీపిక

- హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త దీపిక

లేపాక్షి: లబ్ధిదారులకు ఇంటి ముంగిటకే సంక్షేమ ఫలాలు అందజేస్తున్నది సీఎం వైఎస్ జగన్ ఆధ్వర్యంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమేనని హిందూపురం నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక పేర్కొన్నారు. సోమవారం ఉదయం మండలంలోని నాయనిపల్లి, సాయంత్రం ఉప్పరపల్లి గ్రామాల్లో గడప గపడకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌లను అందజేస్తూ స్థానిక సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేవిధంగా చూస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దీపిక మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రజా రంజక పాలన సాగుతోందన్నారు. గత టీడీపీ ప్రభుత్వం ప్రజలకు ఎన్నికల్లో హామీలు ఇచ్చి వాటిని నెరవేర్చకుండా ప్రజలను మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగనన్న ఇచ్చిన హామీల్లో ఇప్పటికే 98 శాతం పూర్తి చేసిందని గుర్తు చేశారు. ఏ ప్రభుత్వం మేలు చేసిందో ప్రజలంతా గమనించాలన్నారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీలు శిథిలావస్థకు చేరుకున్నాయని, వాటిని పునరుద్ధరించాలని విన్నవించారు. దీనికి ఆమె స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని సమాధానం ఇచ్చారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ నీలావతి, సర్పంచ్‌లు వసుంధర, మంజునాథ్, ఎంపీటీసీ సభ్యుడు ఆదినారాయణ, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, ఎంపీడీఓ నరసింహానాయుడు, ఈఓఆర్డీ శివన్న, నాయకులు తిప్పన్న, గంగప్ప, లక్ష్మినారాయణరెడ్డి, క్రిష్టారెడ్డి, ఫకృద్దీన్, మంజునాథ్, హనుమంతరెడ్డి, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండను ఎస్సీ నియోజకవర్గంగా ప్రకటించండి



సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం అందిస్తున్న నాయకులు

పెనుకొండ: పెనుకొండను ఎస్సీ నియోజకవర్గంగా ప్రకటించాలని పలువురు ప్రజా సంఘాల నాయకులు సబ్ కలెక్టర్ కార్తీక్‌కు సోమవారం వినతిపత్రం అందించారు. నియోజకవర్గంలో ఎస్సీ సామాజిక వర్గం అధికంగా నుండటం వల్ల ఎస్సీ నియోజకవర్గంగా గుర్తించాలన్నారు. ఇందుకు సంబంధించి ఎన్నికల కమిషన్‌కు తగిన నివేదిక పంపాలని వారు విన్నవించారు. ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి రామాంజినేయులు, మాలమహానాడు కన్వీనర్ మూర్తి, నరసింహులు, రవూఫ్, కౌన్సిలర్ శేషాద్రి, వెంకటేసులు పాల్గొన్నారు.

'పురం'లో హమారా జగన్ .. హమారా వైఎస్సార్‌సీపీ



సమావేశంలో పాల్గొన్న నాయకులు

హిందూపురం: 'హమారా జగన్ .. హమారా వైఎస్సార్‌సీపీ ' అనే కార్యక్రమం ద్వారా పట్టణంలోని ముస్లిం, మైనార్టీల ఇళ్లకు వద్దకు వెళ్లి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో అందుకున్న సంక్షేమ ఫలాలను వివరించే కార్యక్రమం చేపడతామని హిందూపురం మైనార్టీ నాయకులు తెలిపారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నియోజకవర్గ నాయకులు వేణురెడ్డి, మాజీ ఎమ్మెల్యే అబ్దుల్ ఘనీ, మున్సిపల్ వైస్‌చైర్మన్ జబీవుల్లా ఆధ్వర్యంలో ముస్లిం, మైనార్టీ పెద్దలు, నాయకుల సమావేశమయ్యారు. నాయకులు మాట్లాడుతూ ఏ ప్రభుత్వం చేయని విధంగా ముస్లిం మైనార్టీలకు మహానేత వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మేలు చేశారన్నారు. అదే స్ఫూర్తితో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్నిరకాలుగా మైనార్టీ సంక్షేమానికి కృషి చేస్తున్నారన్నారు. అన్నిపార్టీలు మైనార్టీలను ఓటు బ్యాంకుగా చూస్తున్నాయే తప్ప పదవులు, ప్రాధాన్యత ఇవ్వలేదన్నారు. ఒక్క వైఎస్సార్‌సీపీలోనే ముస్లిం మైనార్టీలకు పదవులు, రాజకీయ లబ్ధి సంక్షేమ ఫలాలు అందుతున్నాయని చెప్పారు. ఇదే విషయాన్ని ప్రతి గడపకూ వెళ్లి హమారా జగన్... హమారా వైఎస్సార్‌సీపీ అనే నినాదంతో తెలియజేస్తామన్నారు. కార్యక్రమంలో ముతవల్లి తల్హాఖాన్, కౌన్సిలర్లు రోషన్‌అలీ, షాజియా, ఆసీఫ్‌వుల్లా, నాయకులు అంజాద్, అన్సర్, హుమయూన్, ఆటోనగర్‌ప్రెసిడెంట్ ఇస్మాయిల్, సమీవుల్లా, జహీర్, డీజీ అజీజ్‌సాబ్, సీపీసీ సాధిక్, ముస్తఫా, టీటీకే మన్సూర్, రియాజ్ తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

అగళి: ఉపాధి హామీ పథకంలో 100 రోజులు పూర్తి చేసిన కుటుంబాల్లోని 18 నుంచి 26 ఏళ్ల వయస్సున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉచిత కంప్యూటర్ శిక్షణ ఇస్తున్నట్లు జాబ్స్ కోఆర్డినేటర్ లక్ష్మి తెలిపారు. 'ఉన్నతి' పథకం కింద శిక్షణకు హాజరైన వారికి ఉచిత భోజనం, వసతి కల్పించి రోజుకు రూ.270 చొప్పున శిక్షణ పూర్తయ్యాక అభ్యర్థి ఖాతాకు జమ చేయడం జరుగుతుందన్నారు. శిక్షణ పూర్తి చేసిన వారికి రూ.15 వేల నుంచి రూ.25 వేల జీతం ఉండేలా వివిధ నగరాల్లో ఉపాధి చూపుతామన్నారు. ఇంటర్ ఆపైన విద్యార్హత కలిగి ఉండాలన్నారు. మరిన్ని వివరాలకు 7989479371 సంప్రదించాలన్నారు.

డ్రైనేజీ వ్యవస్థను బాగు చేయండి

రొద్దం: మండల కేంద్రంలో ఉన్న డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారి ఇబ్బందులు పడుతున్నారని సోమవారం గ్రామస్తులు స్పందనలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రంలోని పీర్లచావిడి బస్టాండ్ ఆవరణలో మెయిన్ పైప్‌లైన్ లీకేజీ కావడంతో నీరంతా సిమెంట్ రోడ్డుపై ప్రవహిస్తోందని,అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

ప్రార్థనకు హాజరుకావాలి

గుడిబండ: ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులందరూ ప్రార్థనకు హాజరు కావాలని ఎంఈఓ రవిచంద్రకుమార్ తెలిపారు. సోమవారం మండల పరిధిలోని పీ.ఎన్.పాళ్యం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ప్రార్థనా సమయానికి ఉపాధ్యాయులు హాజరు కాకపోవడంతో విద్యార్థుల చేత ఎంఈఓ ప్రార్థన చేయించారు.

చిదంబరరెడ్డికి గిడుగు పురస్కారం

హిందూపురంటౌన్: తెలుగు వ్యవహారిక భాషా పితామహుడు గిడుగు వెంకట రామమూర్తి పురస్కారానికి పట్టణానికి చెందిన కవి, రచయిత సడ్లపల్లి చిదంబరరెడ్డి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘం, తెలుగు భాషాభివృద్ధి ప్రాధికార సంస్థ అధ్యక్షుడు విజయబాబు లేఖ ద్వారా పేర్కొన్నారు. ఈనెల 29న తెలుగు భాషా వికాస వారోత్సవాల్లో భాగంగా విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళాక్షేత్రంలో పురస్కారాన్ని అందజేయనున్నారు.

జుంజప్పకు హారతి ఉత్సవం



ప్రత్యేక అలంకరణలో స్వామివారు

అమరాపురం: మండలంలోని తమ్మడేపల్లిలో వెలసిన యాదవ కులస్తుల ఆరాధ్య దైవం జుంజప్పస్వామికి సోమవారం హారతి ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం శ్రావణమాసం సోమవారం రోజు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగా ఉదయం స్వామి వారికి సుప్రభాతసేవ, పంచామృతాభిషేకం, తదితర పూజలు చేశారు. అనంతరం స్వామివారికి ప్రత్యేకంగా పూలతో అలంకరించి మహా మంగళ హారతి ఇచ్చారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

పురాతన విగ్రహం లభ్యం



రొళ్లలో చెరువులో లభ్యమైన కరియమ్మదేవి విగ్రహం

రొళ్ల: మండల కేంద్రమైన రొళ్ల చెరువులో సోమవారం సాయంత్రం పురాతన కరియమ్మదేవి విగ్రహం లభ్యమైంది. వివరాల్లోకి వెళితే.. ఏళ్ల క్రితం చెరువు కట్ట పైభాగాన కరియమ్మదేవి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజలు చేసేవారట. వర్షాలు కురవనప్పుడు చెరువు కట్టపైన ఉన్న కరియమ్మదేవికి జ్యోతుల ఉత్సవాలు నిర్వహించి పూజలు చేస్తే వారం రోజుల్లోగా వర్షాలు కురిసేవని ప్రజల నమ్మకం. అయితే కొన్నేళ్లుగా విగ్రహం కనిపించకుండా పోయిందని స్థానికులు తెలిపారు. ఇప్పటికీ చెరువు కట్టపై భాగాన చిన్నగా గుడి కూడా ఉందన్నారు. అయితే బాజయ్యపాళ్యానికి చెందిన హనుమేష్ అనే వ్యక్తి అటుగా వెళ్తుండగా మోకాళ్లలోతు నీటిలో విగ్రహం కనిపించిందన్నారు. దీంతో నీళ్లలోకి దిగి చూడగా పురాతన విగ్రహంగా గుర్తించి బయటికి తీశారు. పురాతన కరియమ్మదేవి విగ్రహమని స్థానికులు తెలిపారు. రెపోమాపో యథావిధిగా విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తామని పేర్కొన్నారు. ఎవరైనా విగ్రహాన్ని ఎత్తుకెళ్లి పడవేశారా? లేక మరేదైనా కారణాలతో పడి వేశారా? అన్న విషయం తెలియాల్సి ఉంది. విషయం తెలుసుకున్న పట్టణ ప్రజలు అమ్మవారి విగ్రహాన్ని చూసేందుకు చెరువు వద్దకు క్యూ కట్టారు.

వీఆర్‌కు ఎస్‌ఐ, కానిస్టేబుల్

రొద్దం: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఎస్‌ఐ నాగస్వామి, కానిస్టేబుల్ పోతిరెడ్డిని వీఆర్‌కు పంపినట్లు సీఐ కరుణాకర్ తెలిపారు. వారిద్దరిపై వివిధ ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ఉన్నతాధికారులు చర్యలు తీసుకున్నట్లు చెప్పారు.

విద్యార్థికి ఆర్థిక సాయం

పెనుకొండ: ఎంబీబీఎస్ సీటు సాధించి ఫీజు చెల్లించని స్థితిలో ఇబ్బంది పడుతున్న డేనియల్ నాయక్ అనే విద్యార్థికి స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రూ. 15 వేలు ఆర్థిక సాయం అందించారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటు చేసిన ఓ కార్యక్రమంలో విద్యార్థికి ఉపాధ్యాయులు ఈ మొత్తాన్ని అందించారు.

సమస్యలు పరిష్కరించండి

పరిగి: మండలంలోని అన్ని గ్రామాల్లో డ్వాక్రా మహిళల ఆర్థికాభివృద్ధికి కృషిచేస్తున్నామని, తమ సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపాలని మండల విలేజ్ యానిమేటర్లు కోరారు. ఇందులో భాగంగానే సోమవారం మండల కేంద్రంలో తహసీల్దారు సౌజన్యలక్ష్మికి, వైకేపీ ఏపీఎం దేవానంద్ పిలిప్పస్‌కు వినతిపత్రాలను అందించారు.

శుభకార్యం

అమరాపురం: మండలంలోని వివిధ గ్రామాల్లో జరిగిన పలు శుభకార్యాల్లో ఎమ్మెల్యే తిప్పేస్వామి పాల్గొన్నారు. పేలుబండ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, పంచాయతీ వార్డు సభ్యుడు విశ్వనాథ్ గృహ ప్రవేశానికి ఆయన హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అలాగే ఉదుగూరు గ్రామంలో మాజీ సర్పంచ్ నాగమ్మ గృహ ప్రవేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆయనతో పాటు మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, రంజిత్‌కుమార్, నారాయణ, సురేష్‌కుమార్, తిప్పయ్య తదితరులున్నారు.

సీతారామాలయంలో ప్రత్యేక పూజలు



సీతారామాలయంలో హోమాలు నిర్వహిస్తున్న పురోహితులు

గోరంట్ల: మండల పరిధిలోని మందలపల్లి గ్రామంలో దేవాదాయశాఖ నిధులతో నిర్మించనున్న సీతారామాలయం నిర్మాణం కోసం సోమవారం ప్రత్యేక పూజలు, హోమలు నిర్వహించారు. మందలపల్లిలో పురాతన సీతారామాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో నూతన ఆలయ నిర్మాణానికి దేవాదాయశాఖ రూ.1.25 కోట్ల నిధులు విడుదల చేసింది. దీంతో సోమవారం తహసీల్దార్ రంగనాయకులు మందలపల్లి గ్రామానికి చేరుకొని విగ్రహ పంచనామ నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు పాత ఆలయంలోని సీతారాముల విగ్రహాలను ఆలయం నుంచి తీసీ నీటిలో ఉంచారు. మంగళవారం నిర్మాణ పనులు ప్రారంభిస్తారు. సర్పంచ్ ప్రమీలమ్మ, గ్రామస్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఇరువర్గాల ఘర్షణ

- 19 మందిపై కేసు నమోదు



వివాదాస్పదమైన స్థలం దగ్గర పోలీసు పహారా

పావగడ: ఓ ఇంటి స్థలం కోసం ఇరు వర్గాల మధ్య ఘర్షణ చెలరేగి దాడులకు దారి తీసిన సంఘటన తాలూకాలోని ఎస్‌ఆర్ పాళ్య గ్రామంలోని దళితవాడలో చోటు సోమవారం చేసుకుంది. వివరాల్లోకెళితే... అరసికెర పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ ఆర్ పాళ్య గ్రామం దళితవాడలో గోవిందరాజు తనకు మంజూరైన గ్రామ కంఠ స్థలంలో ఇంటిని నిర్మించుకోడానికి ప్రయత్నిస్తుండగా నాగరాజు అనే వ్యక్తి ఇప్పటికే ఆ స్థలం తనకు మంజూరైందని వాదనకు దిగారు. ఆ ఇంటి స్థలంలో నిర్మించిన పునాది రాళ్లను తొలగించడంతో ఇరు వర్గాల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. ఇద్దరు మహిళలను గాయాలయ్యాయి. ఈ సంఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదు మేరకు 19 మంది పై కేసు నమోదు చేసినట్లు అరసికెర పోలీసులు తెలిపారు. సుమారు 15 ఏళ్ల నుంచి స్థల వివాదం కొనసాగుతునే ఉంది. స్థానిక తహసీల్దార్‌తో పాటు రెవెన్యూ అధికారులు వారి మధ్య రాజీ కుదిర్చి సమస్య పరిష్కారానికి ప్రయత్నించినా ప్రయోజనం లేకుండా పోయింది. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సంఘటనా స్థలంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ థారాసింగ్ తెలిపారు.

సంఘాల బలోపేతానికి కృషి



మాట్లాడుతున్న ఎఫ్‌పీఓ లక్ష్మీనారాయణ

అమరాపురం: మండలంలో ఉన్న మహిళా సంఘాల బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీఎం తిప్పన్న, ఎఫ్‌పీఓ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో హేమ మండల అధ్యక్షురాలు లలితమ్మ అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించారు. మండలంలో వెయ్యికి పైగా సంఘాలు పని చేస్తున్నాయని, ఆయా సంఘాల పనితీరు ఏవిధంగా వుందో గ్రామాల్లోని గ్రామైఖ్య సంఘాల ద్వారా అడిగి తెలుసుకున్నారు. మహిళా సంఘాల సభ్యులు తీసుకున్న రుణాలను వాయిదాల ప్రకారం సక్రమంగా చెల్లించేలా వీఓ లీడర్లు, వీఓఏలు బాధ్యత తీసుకోవాలన్నారు. అదేవిధంగా సంఘాల్లో తీసుకున్న రుణాలను సక్రమంగా సద్వినియోగం చేసుకుని ఆ కుటుంబాలు ఆర్థికంగా ఎదగడానికి కృషి చేయాలని సూచించారు. అనంతరం వీఓ సంఘాల పనితీరు, సంఘాల పొదుపు, రుణాల రికవరీ తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాల మెరుగుకు కృషి



రొళ్ల: పిల్లల చదువుపై శ్రద్ధ వహించి విద్యా ప్రమాణాల మెరుగుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని ఎంఈఓ-2 శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని బంద్రేపల్లి, ఆవినకుంట ప్రాథమిక పాఠశాలలను ఆయన సందర్శించారు. ఆయా పాఠశాలలో రికార్డులు తనిఖీ చేసి విద్యార్థుల హాజరు శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎంఈఓ-2 శ్రీధర్ మాట్లాడుతూ జగనన్న గోరు ముద్ద కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం వడ్డించాలన్నారు.

సీఐ సుబ్బరాయుడుకు సన్మానం



గోరంట్ల: స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా గోరంట్ల అప్‌గ్రేడ్ పోలీస్‌స్టేషన్ సీఐ సుబ్బరాయుడుకు ప్రభుత్వం ఉత్తమ సేవా అవార్డును ప్రదానం చేసిన విషయం విధితమే. ఇందులో భాగంగానే సోమవారం మండల క్రిస్టియన్, మైనార్టీ నాయకులు సీఐను ఘనంగా సత్కరించారు. మండల క్రిస్టియన్, మైనార్టీ అధ్యక్షుడు ప్రణీత్ నిహార్, పాస్టర్ విజయ్ , ప్రభుకుమార్, పీటర్ ప్రకాష్ , సచివాలయ మండల కన్వీనర్ నరసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు



రొళ్లలో ఇంటర్వ్యూ నిర్వహిస్తున్న ఈఓఆర్డీ కృష్ణప్ప

రొళ్ల : వివిధ సచివాలయాల పరిధిలోని ఖాళీగా ఉన్న వలంటీర్ పోస్టుల భర్తీకి స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో సోమవారం ఈఓఆర్డీ కృష్ణప్ప ఆధ్వర్యంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. మూడు పంచాయతీలకు కలిపి తొమ్మిది మంది అభ్యర్థులు దరఖాస్తులు చేసుకున్నారన్నారు. అందులో దొడ్డేరి సచివాలయం కింద ఆరు వలంటీర్ల పోస్టులకు లావణ్య, రాజకుమార్, నాగరాజు, రంగనాథ్, ఎం.రాయాపురం, రొళ్ల సచివాలయం కింద ఒక్కొక్కటి చొప్పున ఖాళీలు ఉండగా ఎం.రాయాపురం నుంచి పల్లవి ఒక్కరే ఇంటర్వ్యూకు హాజరైనట్లు తెలిపారు. అర్హత కలిగిన వారిని గుర్తించి వలంటీర్లుగా ఎంపిక చేస్తామని ఈఓఆర్డీ తెలిపారు.

వర్షం కోసం గంగ పూజ

పావగడ: తాలూకా వ్యాప్తంగా ఇంత వరకు బలమైన వర్షాలు కురవక పోవడంతో తీవ్ర నీటి ఎద్దడి ఏర్పడింది. అరకొరగా సాగు చేసిన వేరుశనగ పంట చినుకులు పడక చిగురులోనే ఎండిపోతోంది. ఈ నేపథ్యంలో వైఎన్ హొసకోట గ్రామ పంచాయతీలోని గౌడ తిమ్మనహళ్లి గ్రామంలో వరుణుడి కరుణ కోసం గ్రామస్తులు సోమవారం గంగ దేవి పూజ చేశారు. గ్రామంలోని చెరువు కట్ట వద్ద పెద్దలు, మహిళలు, పిల్లలు కలసి భజనలు చేశారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోండి

లేపాక్షి: లేపాక్షిలోని మహాత్మాజ్యోతిభా పూలే ఏపీ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని ఆ గ్రామానికి చెందిన ఎల్.రామప్రసాద్ సోమవారం స్పందన కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ కుమార్‌స్వామిరెడ్డికి వినతిపత్రం సమర్పించారు.

గురుకుల పాఠశాల విద్యార్థులు రాత్రి పూట తమ పొలంలోని టెంకాయ, మొక్కజొన్న కంకులను దొంగలిస్తున్నారని పేర్కొన్నారు. రాత్రిపూట విద్యార్థులకు ఏమైనా జరిగితే బాధ్యులు ఎవరో చెప్పాలన్నారు. ఈ విషయంపై ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేస్తే సరైన సమధానం చెప్పకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని, సంబంధిత అధికారులు అతనిపై చర్యలు తీసుకోవాలని కోరారు.